# మనోరంజితం - 9

యథాప్రకారం రోజులు దొర్లిపోతున్నాయి.

మహిమ వసుధను నిద్రపుచ్చేటప్పుడు ఏవో రెండు నీతి కథలు చెప్పాక, కొన్ని కబుర్లూ చెబుతూంటుంది. వాటిలో అభిరామ్ గురించి కూడా కొన్ని ఉండేవి.

ఒకరోజు ''నాన్న చాలా చెడ్డకదమ్మా... డ్రింక్ చేయటం మంచి అలవాటు కాదని మా టీచరు చెప్పిందీ...!'' అంది వసుధ.

మహిమ నిట్టూర్చింది. మీ నాన్న చాలా మంచి... నాకు తెలుసుగా. ఆ అలవాటు మాత్రమే చెడ్డది. అంతే.. అది వదిలేస్తే... మళ్ళీ మామూలు అయిపోతారు.. మంచిగా...!''

వసుధ నవ్వింది. ''అయితే నాన్నని వచ్చెయ్యమని చెప్పవా అమ్మా...?'' గోముగా అడిగింది.

''అదేమిటీ... నీకు నాన్నంటే భయం కదా... పిలిచినా దగ్గరకు వెళ్ళేదానివి కాదుగా...'' అంది మహిమ ఆశ్చర్యంగా మొహం పెట్టి.

''ఇపుడు నాకు భయంలేదులే అమ్మా.... రమ్మని చెప్పు... నాన్న ఇక్కడే ఉద్యోగం చేస్తే... మనం అందరం కలిసి ఉండొచ్చుగా...?''

" మందు అలవాటు మానేసేవరకూ రావద్దని... చెప్పేసానమ్మా. అందుకని రారు... అదిసరేగానీ, ఇపుడెందుకు రమ్మని పిలవమంటున్నావో చెబుతావా...?''

''మా ఫ్రెండ్సంతా వాళ్ళ నాన్నల గురించి చెబుతోంటే... నాకూ నాన్న కావాలనిపించింది! నాన్నని నేనే భయపెట్టానేమో అని అనుమానం వచ్చింది కూడా...'' ఆరిందాలా కళ్ళు తిప్పుతూ అంది.

మహిమ సరదాగా నవ్వింది. ''నాన్న ఆ చెడ్డ అలవాటును వదిలేసాక మన దగ్గరకు తానే వచ్చేస్తారు... మనం పిలవనక్కర్లేదులే...!''

''ఏమోనమ్మా... నేను భయంతో దూరంగా పారిపోయేదాన్నని... కోపం వచ్చి... నాన్న అలా దూరంగా ఉద్యోగం చూసుకుని వెళ్ళిపోయారేమోనని నాకు అనుమానం వస్తోంది...! అందుకే 'నాకిపుడు భయం లేదు నాన్నా... వచ్చేయి... సంతోషంగా, సరదాగా ఉందాం...' అని చెప్పాలనిపిస్తోంది...!''

మహిమకు మనసు ఆర్ద్రమైపోయింది, వసుధను చేతులతో చుట్టేసి ప్రేమగా గుండెలకు హత్తుకుంది. ''లేదమ్మా... మీ నాన్న గురించి నాకు బాగా తెలుసుగా, నీ మీద కోపం ఏమీ ఉండదు...'' అని సర్దిచెబుతూ జోకొట్టింది.

వసుధ నిద్రలోకి జారిపోయిందనుకున్నాక, పాప మీద చేయి అలాగే ఉంచి... వసుధకో లేక స్వగతమో అన్నట్లు మనసులోని తన దుఃఖావేశాన్ని, భావోద్వేగాన్ని... మాటల్లోకి మార్చి చెప్పుకోవటం మొదలు పెట్టింది. తన మనసులోని మాటల్ని చెప్పుకోవాలంటే... తనకు పాప తప్ప ఎవరూ లేరనే భావం ఆమెను తరచూ వెన్నాడుతోంది...! అందుకే ఆ అలవాటు అయింది.

'వసూ... నువ్వు... ఇప్పటి మీ నాన్న రూపాన్ని చూసి భయపడ్డావుగానీ, మా పెళ్ళికి ముందు ఎలా ఉండేవారో నీకు తెలియదు. ఆ మందు భూతం పట్టినందువల్లే... మీ నాన్న మనసు, రూపం... అన్నీ మారిపోయాయి...!

నా పరిచయం వల్లే... నా ప్రేమ కోసమే... ఆ అలవాటును వదిలేస్తున్నానని చెప్పినపుడు... నేను నిజంగా ఆయన రూపానికి మాత్రమే కాదు వసూ... ఆ ప్రేమకు ముగ్ధురాలినైపోయి... తనకి దాసోహమైపోయాను. అందుకే... పాత అలవాటు మళ్ళీ విజృంభించే అవకాశం ఉండొచ్చని ఎవరు హెచ్చరించినా నేను లక్ష్యపెట్టలేదు...!

ఒకసారి నా స్నేహితురాలు ఉష ఏమందో తెలుసా... మీ నాన్న తన అలవాటును అంత సునాయాసంగా వదిలేయగలగటం చూసి 'నాకు భలే ఆశ్చర్యంగా ఉంది... ప్రేమ మహిమ ఇంతలా ఉంటుందా అని...! 'దానికి మీ నాన్న ఏమని జవాబు ఇచ్చారో తెలుసా...?

'అవును... మహిమలోని ప్రేమకు అంతటి శక్తి ఉందీ...' అని!

మీ నాన్న రూపానికి ఎంతటి ఆకర్షణ ఉందో, మాటలకీ అంతే వసూ...! నువ్వు పుట్టిన ఒక సంవత్సరం వరకూ రోజులు ఎంత ఆనందంగా గడిచిపోయాయో... జీవితంలోని మాధుర్యమంతా అప్పుడే అనుభవించేశాననిపిస్తోంది...! అపుడు... నాకు ఎన్నో బంధాలూ, అనుబంధాలూ...! ఇప్పుడో... నువ్వు ఒక్కదానివే... నా జీవితానికి ఆలంబన, ఆశా... అన్నీ...! నిజం వసూ... నువ్వే లేకపోతే, ఈ జీవితానికి అర్థం, పరమార్థం ఏమీ ఉండేవి కావు. ఇపుడు ఎవరు లేకపోయినా, నువ్వు ఒక్కదానివే నాకు ఉన్నావు... చాలు... ఈ విశ్వంలోని ఎన్ని విధాలైన ఐశ్వర్యాలైనా, నీకు సమానం కావనిపిస్తోంది!

నిన్ను నా కప్పగించినందుకైనా నేను రోజూ మీ నాన్నని తలుచుకుంటున్నాను! వసూ.. నీ మాటలు విన్నపుడు... మీ నాన్న తెలివితేటలు నీకు వారసత్వంగా లభించాయేమోననిపించి నాకెంత ఆనందంగా ఉంటుందో...! మీ నాన్నమ్మ అపుడపుడూ చెప్పిన మీ నాన్న చిన్ననాటి సంగతులన్నీ నిన్ను చూస్తుంటే గుర్తుకు వస్తుంటాయి! ఈ జీవితానికి ఇవే నాకు గొప్ప ఓదార్పు నిచ్చి ఊరట కలిగిస్తుంటాయమ్మా...!

అలా ఏవేవో కబుర్లు జ్ఞాపకం వచ్చినవన్నీ తనలో తాను చెప్పుకుంటునట్లుగా అనుకుంటూ అలాగే వసుధ పక్కన ఎప్పటికో నిద్రకు పడుకుంది మహిమ.

* * *

''అభిరామ్ గారూ... మీరేమిటీ ఇక్కడ...?''

మత్తులో వాలిపోతున్నట్లుగా ఉన్న అతనిని సరిగా కూర్చోబెట్టింది ఉష.

ఆటోకోసం చూస్తున్న ఉషకు... ఒక ఆటో ఆగటం కనుపించి, దగ్గరకు వెళ్ళింది. లోపల ఒకరు ఉన్నారు. ''ఇతనిని ఇక్కడికి దగ్గర్లోనే ఉన్న ఇంటిలో దింపి వెళ్ళాం... ఎక్కండీ...'' అన్నాడు.

అతను కూర్చున్న తీరు గమనించిన ఉషకు బాగా తాగివున్నాడని అర్థమై సంకోచంగా అనిపించింది. పక్కనే ఆమె కొడుకు చిన్నపిల్లాడు కూడా ఉన్నాడు.

''మీకేం భయం లేదు సిస్టర్... ఎక్కండి... నా ఇల్లు పక్కనే...'' అన్నాడతను ముద్దముద్దగా.

అప్పుడు ఉష అతనిని గుర్తుపట్టి పలుకరించింది.

అతను గుర్తుపట్టినట్లో, లేదో తెలియనట్లుగా తలవూపి వూరుకున్నాడు.

'మహిమ ఎక్కడుంది... మీరు ఒంటరిగా ఎక్కడికి వచ్చారూ...' లాంటి ప్రశ్నలన్నింటికీ అతని మౌనమే సమాధానం అయింది. అప్పటి అతని స్థితిలో, అతన్ని అడగటం అనవసరం అని తెలుసుకున్న ఉష... అతను ఇంట్లోకి వెళ్ళటానికి  సహాయం చేసింది.

అతను బార్ నుండి వస్తూ... ఆటో వాళ్ళకి తన అడ్రసు కాగితం ఇవ్వటం వలన ఇంటికి క్షేమంగా చేరుతున్నాడన్న మాట... అని గ్రహించింది.

అది పేరుకి ఇల్లేగానీ... సామాన్లన్నీ అస్తవ్యస్తంగా పడివున్నాయి. రెండు గదులు. ఎవరో ఇంకోకతనితో కలిసి ఉంటున్నాడని ఉషకు అర్థమైంది.

అతనిని ఉష అభిరామ్ గురించి వివరాలడిగింది.

అభిరామ్ కూడా తను చేస్తున్న కంపెనీలోనే ఉద్యోగం చేస్తున్నాడుగానీ, రెండు రోజుల క్రితమే అది పోయింది. ఇంకొకటి ఏదైనా చూసుకునే ప్రయత్నంలో ఉన్నట్లు చెప్పాడు. అంతకుమించి అతని వివరాలేం తనకు తెలియవని అతను చెప్పటంతో మరునాడు వచ్చి అభిరామ్‌ని కలుస్తానని చెప్పింది. ఎక్కడికీ వెళ్ళకుండా గదిలోనే ఉండమని చెప్పమనీ రిక్వెస్టు చేసి ఉష మళ్ళీ ఆ ఆటోలో కొడుకుతో పాటుగా ఇంటిదారి పట్టింది.

చెప్పినట్లే ఆ మరునాడు అడ్రసు తెలుసు కాబట్టి అభిరామ్ ఇంటికి వెళ్ళింది. అభిరామ్ తో పాటూ ఉండే అతను ఆఫీసుకు వెళ్ళిపోయాడేమో, అభిరామ్ ఒక్కడే ఉన్నాడు.  ఉషను చూడగానే అభిరామ్ చిరునవ్వుతో ''రండి...'' అంటూ ఆహ్వానం పలికాడు.

''నా ఫ్రెండు మీ పేరు చెప్పాడుగానీ, మీరేనా, ఇంకెవరైనానా అనుకుంటూ ఎదురు చూస్తున్నాను. సారీ... రాత్రి మిమ్మల్ని గుర్తుపట్టి సరిగా పలుకరించలేకపోయుంటాను...!'' అన్నాడు.

ఉష నవ్వింది. ''ఫర్వాలేదు... అందువల్లే మిమ్మల్ని మరోసారి కలిసే అవకాశం వచ్చింది...! మీ సంగతులు అడిగే ముందు నా గురించి చెప్పేస్తాను. మహిమవాళ్ళమ్మగారు చనిపోయిన రోజులలోనే నా పెళ్ళి అయింది. అందుకే, ఆ విషయం తెలిసి పిలవలేదు. మీ అమ్మగారిద్వారా కొన్ని విషయాలు తెలిసాయి గానీ పూర్తి వివరాలు తెలియలేదు. నేను కూడా కుటుంబ బాధ్యతలతో వీలుకాక మహిమను కలుసుకునే ప్రయత్నం చేయలేకపోయాను...' అని చెప్పి అతని గురించి ప్రశ్నలడిగింది.

''ఏం చెప్పాలో తెలియటం లేదు ఉషా. నాది స్వయంకృతాపరాధమే... అందుకే ఒంటరితనపు శిక్షను అనుభవిస్తున్నాను. మహిమకు మాట ఇచ్చి తప్పాను... నిన్నటి వరకూ ఈ జీవితం ఇంతేననే నిర్వేదంతో బ్రతికేసాను. నా ఒంటరి తనాన్ని, బాధనూ మర్చిపోవటానికన్నట్లు... నన్ను నేనే మోసం చేసుకుంటూ మత్తుగా రోజులు దొర్లించేసాను. అయితే... ఈ రోజు ఉదయం నుండీ... నన్ను నేను మార్చుకోవాలనే ఆలోచనతో సతమతమవుతున్నాను...!''

అభిరామ్ అలా మాట్లాడుతోంటే... ఉష తనకేమీ అర్థంకాలేదన్నట్లు చూసింది.

''అవును... మీకు అసలు విషయం చెప్పలేదుగా... ఎలా తెలుస్తుంది లెండి. నిన్న మా వసూ దగ్గర్నుండి ఉత్తరం వచ్చింది....'' అని చెబుతూండగానే ''ఏమంటున్నారు.. అంత చిన్నపిల్ల... మీకు

ఉత్తరం రాసిందా... నిజమా... మహిమ రాయించిందేమో... ఇంతకీ ఉత్తరంలో ఏం ఉందీ...?'' ఆగలేనట్లు ఆతృతగా ప్రశ్నల వర్షం కురిపించింది ఉష.

అతను సమాధానంగా తన షర్టు జేబునుండి ఓ కవరు తీసి ఉష చేతికిస్తూ ''చదవండి... మీ సందేహాలు చాలావాటికి సమాధానాలు దొరుకుతాయి...'' అన్నాడు.

''రాత్రి చదవలేదుగానీ ఉదయం చదివాను. అప్పటినుండి ఆగలేక ఎన్నిసార్లు చదివానో లెక్కలేదు! చెప్పానుగా... నిన్నటివరకూ నిర్లిప్తంగా మందు మత్తులో బత్రికేస్తున్న నాలో ఈ ఉదయం నుండీ ఈ

ఉత్తరం వలన పెను సంచలనమే రేగినట్లయింది! మా చిన్నారి వసుధ కోసం... నేను మళ్ళీ మామూలు మనిషిని అవ్వాలనే కోరిక బలపడిరది...!'' అన్నాడు మళ్ళీ అభిరామ్.

ఉష ఏం మాట్లాడకుండా కవరు తీసి కాగితాలు చదవటం మొదలు పెట్టింది.

నాన్నా...

నేను... మీ చిన్నారిని. మరిచిపోయారేమోననే అనుమానం వస్తోంది! మిమ్మల్ని నేను మర్చిపోకుండా... నాకు పక్కనే అమ్మ ఉండి... మీ కబుర్లు చెబుతూ వుంటుంది! నాన్నమ్మా, తాతయ్యా అపుడపుడూ వస్తుంటారా... వాళ్ళూ అంతే... మీ కబుర్లే ఎక్కువగా చెబుతూంటారు! అందుకే... మిమ్మల్ని కలవాలనే కోరిక నాలో రోజురోజుకీ పెరిగిపోతోంది!

నాన్నా.... మీరు... అంత దూరానికి ఉద్యోగం కోసం వెళ్ళారని అమ్మ చెప్పింది. పైగా నాకు నాన్నంటే భయంగా, అందుకే దూరంగా వెళ్ళారని చెప్పింది.

నాన్నా... నా కిపుడు భయంలేదు. మీరొచ్చేస్తే చాలు... ఇక్కడే ఉద్యోగం చేద్దురుగానీ, మిమ్మల్ని ఇక్కడకు వచ్చెయ్యమని చెప్పమని అమ్మనడిగితే ఏం అన్నదో తెలుసా...?

మీరు మందు భూతాన్ని వదిలించుకున్నాకనే మా దగ్గరకు వస్తారని చెప్పింది. అంతవరకూ రాదలుచుకోలేదటకదూ...! మీరొక్కరే ఉండి ఆ పని చేయటం ఎందుకూ... ఇక్కడికి వస్తే... చాలామందిమి ఉన్నాంగా, తేలికగా ఆ భూతం పారిపోయేట్లు చేయగలం కదా! అమ్మ, నేనే కాదు, తాతయ్య, నాన్నమ్మా కూడా ఉన్నారా... మనం అంతా కలిసి ఆ భూతాన్ని తరిమికొట్టలేమా...? చెప్పు నాన్నా... అమ్మ అంటుందీ... మీరు ఒక్కరూ ఆ భూతాన్ని వదిలించుకోవాలని మనసులో గట్టిగా అనుకుంటేనే వీలవుతుందట! నాన్నా... ప్లీజ్... అలా అనుకోండి నాన్నా...! నాకు మీతో కలిసి నవ్వుతూ ఆడుకోవాలని ఉంది.

నేను దూరంగా ఉండటం వలనే మీరు మాకు దూరం వెళ్ళారని అమ్మ చెప్పింది. నిజమా నాన్నా... చిన్న పిల్లకేం తెలియదులే పాపం అనుకోలేదా...? నా మీద కోపంతో వెళ్ళిపోయారంటే... నాకు బాగా ఏడుపు వచ్చేస్తోంది!

నాన్నా... నాన్నమ్మ నాకో మంత్రం చెప్పింది. దాంతో భూతాన్ని పారద్రోలవచ్చునట! ఆ మంత్రం పేరు వింటే, నీకు నవ్వొస్తుంది కూడా... దానిపేరు నవ్వుల మంత్రమే...! తమాషాగా ఉంది కదూ...!

ఇంట్లో... నవ్వుల మంత్రం అందరు జపిస్తూంటే... పరవశం స్థావరం ఏర్పరచుకుంటుందట! సమస్యల భూతం పలాయనం చిత్తగిస్తుందట... అంటే పారిపోతుందని అర్థం...! ఈ మాట నాన్నమ్మే చెప్పింది నాకు... నాన్నా.... నాన్నమ్మ నాకు ఎన్నిరకాల తెలుగు పద్యాలు నేర్పించిందో తెలుసా... 'సిరికిం చెప్పడు.... మందార మకరంద మాధుర్యమనేదట..... కలయో వైష్ణవ మాయో... ఓయమ్మ నీకుమారుడు... ఊరక రారు మహాత్ములు... ఇంతింతై వటుడిరత్j ె ైంి... అల వైకుంఠపురంబులో...' ఇలా చాలా పద్యాలు నేర్చుకున్నాను.

తాతయ్య దగ్గిర అవన్నీ చెప్పమంటుంది ఒకసారి 'అన్నీ మీ నాన్న తెలివి తేటలే వచ్చాయి....' అంది. అలా ఎలా వస్తాయి.... నీకెలా తెలిసిందీ...? అనడిగితే మీ చిన్నతనంలో హైస్కూలు రోజుల్లో, తరువాత కాలేజీలోనూ నాటకాలు

రాసి.... వాటిని డైరెక్టు చేసి స్కూలు ఫంక్షన్స్‌లో ప్రదర్శించేవారట కదూ... అది చెప్పి తల్లిదండ్రుల అలవాట్లు తెలివితేటలూ కూడా పిల్లలకూ అలవడతాయని అంది! మీ నాన్న కంటే చిన్న వయసులోనే నువ్వు అలా నాటకాలూ అదీ రాయగలుగుతావు. ప్రయత్నించూ... అనీ నాన్నమ్మ చెప్పింది.

ఇలాంటి పద్యాలేకాదు నాన్నా, భాగవతంలోని ఎన్ని కథలు చెప్పిందో నాన్నమ్మ. నాన్నా... మీరు వచ్చి నాకు మీలాగ నాటకాలు రాయటం కూడా నాకు నేర్పించాలి. నాకు తెలుగు చదవటం, చక్కగా రాయటం కూడా నాన్నమ్మ వల్లే వచ్చాయని అమ్మ అంటుంది. నాటకాలు రాయటం మీ వల్ల నేర్చుకోవాలి!

నాన్నా... నాకు మీ గురించి ఎన్నో తెలుసు. అమ్మనాకు ప్రతీరోజూ కబుర్లు, కథలూ చెబుతూంటుందా... తరువాత మీ కబుర్లు ఎన్నో నెమరేసుకుంటుంది. సగం నిద్రలో కొన్ని, నిద్ర పట్టకముందే కొన్నీ అవీ వింటూంటాను. అందుకే మీ గురించి నాకు చాలా తెలుసనిపిస్తుంది!

నాన్నా... అమ్మ చెప్పే కబుర్లలో కొన్ని మీకు చెప్పనా...? నేను పాపాయిగా ఉన్నపుడు... మీరు ఇంటికి రాగానే ముందు నన్నెత్తుకునేవారట! అమ్మ చేతిలో నుండి... మీకోసం ఎదురు చూస్తున్నట్లు మీ మీదకి ఎగిరి దూకేదాన్నని చెబుతుంది. మీ మెడ చుట్టూ చేతులు వేసి చెంపలపై నేను ముద్దులు పెడితే, మీరేమో కితకితలు పెట్టి .... నన్ను నవ్వించి, మీరూ నవ్వితే, అమ్మకీ బాగా నవ్వొచ్చేదట! అలా ప్రతీరోజు హాయిగా నవ్వుకునే వాళ్ళమని అమ్మ చెబుతూంటుంది. ఇపుడూ 'సరదాగా నవ్వమ్మా' అంటే... 'నవ్వాలని ప్రయత్నిస్తున్నా... కళ్ళ వెంబడి నీళ్ళే వస్తున్నాయిగానీ, నవ్వులు రావటం లేదే...' అంది దిగులుగా మొహం పెట్టి.

మీరు వచ్చేస్తే... మళ్ళీమునుపటిలా సరదాగా నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుందాం...! నేను బడి నుండి వచ్చాక, అమ్మకి మా స్కూలు కబుర్లు, పాఠాల సంగతులు అన్నీ చెబుతా. ఇపుడు ఒక్కదానికే చెబుతున్నా... మీరూ వచ్చేస్తే... మీకూ బోలెడు తీపి మిఠాయి కబుర్లు! నోరూరుతుందా... వచ్చేస్తారా...?

నాన్నా... అమ్మకి చెప్పకుండా ఈ ఉత్తరం స్కూలు లంచ్ అవర్ లో కూర్చుని తొందరగా రాసేస్తున్నా.

ఆ మధ్యనోసారి అమ్మ హ్యాండ్ బాగ్‌లోని ఒక విజిటింగ్ కార్డు చూసి ఎవరిదని అడిగాను. మీకు యాక్సిడెంట్ అయినపుడు... మీ ఫ్రెండ్ ఒకరు ఏదైనా సాయం కావలిసినపుడు ఫోను చేయమని చెప్పారంది.

ఆ కార్డులోని నెంబరుకు ఫోను చేసి 'మీ అడ్రసు చెప్పి సాయం చేయమని' అడిగా చాలా సంతోషంగా చెప్పారు నాన్నా! ఇంటికి ఆయన వస్తానంటే, నేనే వద్దని చెప్పా... అమ్మకు చెప్పకుండా ఫోను చేశాననీ. నాన్న వచ్చాక రావచ్చంటే... ఎపుడూ అని ఆశ్చర్యంగా అడిగారు.

నా ఉత్తరం అందాక ఎపుడు వచ్చేదీ తెలుస్తుందని అన్నాను. ఎపుడు వస్తారు నాన్నా....? నేను ఉత్తరాన్ని ఎలా రాసాను నాన్నా...? మా స్కూలు టీచర్లు ఉత్తరాలు రాయటం అన్నీ చెబుతారు.

తొందరగా వచ్చేస్తావు కదూ నాన్నా...!

మీ చిన్నారి ... వసుధ.

ఉత్తరం చదవటం పూర్తిచేసిన ఉష దిగ్భ్రాంతితో చూసింది అభిరామ్ వైపు.

''అంత చిన్నపిల్ల రాసిన ఉత్తరమంటే నమ్మలేకపోతున్నాను...' అంటూ ఆ కవరును అభిరామ్ చేతికి అందించింది.

''నాకూ అలాగే ఉంది. మా వసూ ఇంత చిన్న వయసులోనే అంత పెద్దదానిలా రాసిందా... లేక అపుడే ఇలాంటి ఉత్తరం రాయగలిగేంత వయసు వచ్చేసిందా... అర్థం కావటంలేదు! ఏమైనా గానీ... జీవితంలో నేను చాలా విలువైన కాలాన్నీ... భార్యాపిల్లలతో పొందే ఆనందాన్నీ పోగొట్టుకున్నానని అర్థమైంది! అందుకే... వసుధ అన్నట్లు... మందు భూతాన్ని ఎలా వదిలించుకోవాలా అనే ఆలోచనతో ఉదయం నుండీ సతమతమవుతున్నాను...!' నిట్టూర్చాడు అభిరామ్.

ఒక క్షణం ఆలోచించిన ఉష ''నేనో సలహా చెప్పనా...?'' అనడిగింది.

ఏమిటన్నట్లుగా చూసిన అభిరామ్ తో ఉష చెప్పింది. ''మా పెద్దమ్మగారి అమ్మాయి... కమలక్క... హైద్రాబాద్‌లోని ఒక డి. అడిక్షన్ సెంటర్ లో వర్క్ చేస్తోంది. మీరు వెళ్ళి అక్కడ జాయినయి మళ్ళీ ట్రీట్‌మెంట్ తీసుకోండి. మీకు నిజంగా ఆ అలవాటును వదిలెయ్యాలనే కోరిక గాఢంగా ఉంటే... తప్పకుండా ఆ వ్యసనాన్ని జయించగలరు! కష్టంకాదు. నేను తనకి ఫోను చేసి చెబుతాను. మీకు అడ్రసూ ఇస్తాను. చాలామంచిది మిమ్మల్ని బాగా జాగ్రత్తగా చూసుకుంటుంది. సంశయం ఏం లేకుండా వెంటనే వెళ్ళండి. ఒక్కరుగా ప్రయత్నించాలంటే కష్టమే. అక్కడయితే అన్ని ఏర్పాట్లు ఉంటాయి. నలుగురితో కలిసి ఉంటారు. అప్పుడు మీరు ఆ అలవాటు నుండి మహిమ స్నేహం వలన తొందరగా బయటకు వచ్చారు. ఇపుడు... మీ చిన్నారి వసుధ కోరిక మీకా మానసిక బలం ఇస్తుంది....! ఏమంటారు...?''

''చాలా మంచి సలహా ఇచ్చారు ఉషా. ఇక ఆలశ్యం చేయను. ముందు... వెంటనే మా వాళ్ళ దగ్గరికి వెళ్ళాలనిపించింది. కానీ నిగ్రహించుకున్నాను. అవును... మహిమ చెప్పినట్లుగా ఆ భూతాన్ని వదిలించుకునే ఆరోగ్యంగా వాళ్ళ ముందు నిలబడతాను! ఆ అర్హత సాధిస్తాను...!''

అభిరామ్ మాటల్లోని నిశ్చయానికి ఉష సంతోషం చూపిస్తూ చిరునవ్వుతో సెలవు తీసుకుంది.

* * *

ఆ ఆవరణలోకి అడుగు పెట్టగానే... అభిరామ్ మనసును ఏదో తెలియని ప్రశాంతత ఆవరించింది! పచ్చని పరిసరాలకున్న మహిమ అలాంటిదనిపించింది!

శారీరక మానసిక ఆరోగ్యాలకి ప్రకృతే వైద్యం చేస్తుందనటానికి నిదర్శనమే... తన మనసు

ఉల్లాసంగా మారటం అనుకున్నాడతను.

తల్లికి ఫోను చేసి తను ఇలా చేరిన విషయం తెలియజేశాడు. మనోరమ చాలా సంతోషించింది. అపుడపుడూ ఫోను చేస్తుంటానంటూ... తన గురించి ఇంకెవరికీ అపుడే తెలియజేయాల్సిన పనిలేదన్నాడు. మనోరమకి అర్థమైంది.... మహిమకు అపుడే చెప్పాల్సిన అవసరం లేదంటున్నాడని. ఏమైనా తనంతటతానుగా అటువంటి నిర్ణయం తీసుకోవటమంటే... మంచి మార్పు రావటానికి సంకేతంగా భావించి చాలా ఆనందించిదావిడ.

అక్కడి పద్ధతులన్నీ కూడా అభిరామ్‌కు బాగా నచ్చాయి. ఆరోగ్యకర జీవనానికి సంబంధించిన ప్రణాళికలు ఉన్నాయి. అందరూ అవి తప్పనిసరిగా పాటించాల్సిందే.

వేకువరaాముునే లేవటం... వ్యాయామం... పౌష్టికాహారం... ఎవరికి తగిన పని వారు చేయటం... విశ్రాంతి... ఆటపాటలు... ఇవన్నీ కూడా అక్కడి ట్రీట్‌మెంట్‌లోని పద్ధతులు!

తల్లీ తండ్రి చెప్పిన క్రమశిక్షణా పద్ధతులకు చిరాకుపడి కోపగించుకునే తను... ఇపుడు మాత్రం ఇక్కడ ఫీజు చెల్లించి పాటించాల్సి వస్తోందని మనసులో నవ్వుకున్నాడు కూడా!

కొందరు ప్రముఖులు వచ్చి... వ్యసనాలనుండి బయటపడే మార్గాలను వివరించటమూ జరుగుతూంటుంది. తమ ప్రసంగాలద్వారా వ్యసనాల వలన సంభవించే ఆర్థిక నష్టాల గురించే కాకుండా ఆరోగ్యపరంగా ఎంతటి అనర్థం జరుగుతుందో ఉదాహరణలతో ఆసక్తికరంగా చెబుతారు. తమ జీవన విధానం, వ్యసనాల వలన జీవితం ఎంత నికృష్టంగా మారిందో చాలామంది గుర్తించి... బయటపడాలనే సంకల్పాన్ని తమ ఉపన్యాసాల ద్వారా వారు కలిగిస్తారు!

అంతే కాకుండా అక్కడ ట్రీట్‌మెంట్ తీసకుంటున్న వారి కుటుంబ సభ్యులను రప్పించి... కుటుంబానికి ఆ వ్యసనాల బారిన పడినవాళ్ళు ఎలాంటి కష్టనష్టాలను కలిగించారో వివరించమంటారు. ఆ అనుభవాలూ చాలామందికి పాఠాలుగా పనిచేస్తాయని.

అక్కడ వ్యసనాల బారిన పడినవాళ్ళు అన్ని వయసుల వారూ ఉన్నారు. మందు, జూదం, డ్రగ్స్... ఇలాంటి అన్ని రకాల వ్యసనాలకీ వైద్యం జరుగుతూంటుంది.

కొందరి అనుభవాలు అభిరామ్‌ను బాగా ఆలోచింపచేశాయి. అతనిలోని రచయితకు స్ఫూర్తినిచ్చి అతని చేత కలం పట్టించాయి! అలా విన్న కొంతమంది అనుభవాలను అభిరామ్ నాటికలుగా రచించి... అక్కడి వారినే కొంతమందిని ఎన్నుకుని... వారిచేత చక్కగా నటింపచేసి తన దగ్గరున్న కెమెరాతో చిత్రీకరించి... ఆ ఫిల్ములను ప్రదర్శించినపుడు... అందరినుండీ అభిరామ్‌కు ప్రశంసలు దక్కాయి!

అలవాటుగా అక్కడివాళ్ళ కుటుంబసభ్యుల ప్రసంగాలనుండి ఒక చిన్న అమ్మాయి... చెప్పిన అనుభవాలను నాటికగా తీర్చిదిద్దాడు అభిరామ్. అదే అతని మొదటి షార్ట్ ఫిల్ము. కూతురు నేర్పిన పాఠం... ఆ నాటిక పేరు.

అది రాస్తున్నంత సేపూ అభిరామ్ మనసులో వసుధ తనకి రాసిన ఉత్తరమే మెదిలింది. అదొక అపురూపమైన అనుభూతి కలిగించే కానుకగా అతను భద్రంగా దాచుకున్నాడు. తరుచూ చదువుకుంటూ 'నీకు వెంటనే జవాబు రాయలేకపోతున్నానమ్మా... నువ్వు చెప్పినట్లుగా అక్కడికి వచ్చి... మీ సాయంతో ప్రయత్నించటం కంటే... ఇలా దూరంగా ఉంటే, ఈ ప్రయత్నంలో విజయం సాధించగలిగితేనే మీ దగ్గరకు వచ్చి కనిపిస్తాను...!' అని మనసులోనే కూతురికి జవాబు చెప్పుకుంటూ ఉండేవాడు.

ఎనిమిదో తరగతి చదువుతున్న ఒక అమ్మాయి... నదురూ బెదురూ లేకుండా అందరి ముందూ నిలబడి తన కుటుంబ విశేషాలను ఏకరువు పెట్టింది.

''ఒకసారి మా బడిలో... ఓ క్లాసుమేటు వాళ్ళు కొత్తగా కట్టించుకున్న ఇల్లు గురించి చెబుతూ మా గురించి వాకబు చేసింది. మేం ఉంటున్న ఇల్లు మాకు చాలా బావుంది కాబట్టి ఇక కొత్తగా వేరే ఇల్లు కట్టుకోవాల్సిన పనిలేదని నేను చెప్పగానే నవ్వి ''ఆపూరిపాకా...' అంది. ఇల్లంటే హంగూ ఆర్భాటం ఉన్న గొప్ప భవనమే కానక్కరలేదని నా ఉద్దేశ్యం! నాకలాంటి భావం ఏర్పడటానికి మా కుటుంబమే కారణం!

మాది పేద కుటుంబమే కావచ్చునుగానీ... సంతోషాలకి కొదవలేదని మాత్రం ఖచ్చితంగా చెప్పగలను! మా అమ్మానాన్నలిద్దరూ పనులకి వెళ్తేనే గానీ మాకు రోజు గడవదు. మా అమ్మ రోజూ పొద్దున్నే రెండిళ్ళల్లో పనులు చేసి... ఆ తర్వాత పొలం పనులకు వెళ్తుంది.

మా నాన్న మాత్రం ఇంట్లోని పనులన్నీ నా సాయంతో పూర్తిచేసి... అప్పుడు వెళ్తాడు. నన్ను స్కూలు దగ్గర దింపాకనే ఏ పనికైనా వెళ్ళటం జరుగుతుంది. మాకో ఎకరం పొలం ఉంది. ఆ పొలం గట్టుమీద కొద్ది దూరం నడిస్తే... మా స్కూలుకి చేరుకోవచ్చు. నేను ఒక్కదాన్నీ వెళ్ళగలనుగా నాన్నా అన్నా... మా నాన్న వినిపించుకునేవాడు కాదు. 'ఆ పొలాన్ని చూస్తూ... ఆ గట్టుమీద నిన్ను చేయిపట్టుకుని నడిపించుకుని వెళ్ళటం... నాకు చాలా బావుంటుంది' అనేవాడు.

అంతేనా... 'మన పొలంలో ఆ మూల నాటిన మామిడి మొక్క ఎంత బాగా ఎదిగిందో... వచ్చే సంవత్సరానికి చక్కగా కాపుకొస్తుంది. నువ్వు... అప్పుడు మనపొలంలోనివే తినొచ్చు. ఇక్కడ వేసిన జామ చెట్టునిండా ఎన్ని పిందెలో... నాలుగు రోజుల్లో దోరకాయలు కోసుకొస్తాను... నీ నేస్తాలకూ ఇవ్వొచ్చు. నేరేడు చెట్టునుండి పళ్ళు చాలానే రాలినట్టున్నాయి... నీకు ఇష్టం కదా, తెస్తానుండు...' అంటూ ఇన్ని పళ్ళు... కడిగి తెచ్చి జేబురుమాల్లో మూటకట్టి నా చేతిలో పెట్టేవాడు నాన్న. అలా నాన్న చేయి పట్టుకుని... కబుర్లు వింటూ, చెబుతూ స్కూలుకి వెళ్ళేదానిని. ఇలాంటి చాలా చిన్న చిన్న సంఘటనలు ఇచ్చే సంతోషం చాలా గొప్పగా ఉంటుందని తెలుసుకోగలిగాను నేను!

అమ్మా, నాన్న, నేనూ... ఇలాంటి మా సంతోషాల చిన్న కుటుంబంలో చిచ్చు రేగింది!

మా బంధువులు... మా నాన్నను పదిరోజుల పాటు పొలం పనులకు సాయం రమ్మని పిలిచారు. మా నాన్నకు ముఖ్యమైన పని అంటే... నన్ను బడికి తీసుకెళ్ళటం... ఆ పైన మా పొలంలో పనులూ... అంతే...!

అపుడు నాకు సెలవులు... మా పొలంలోనూ పనులేవీ లేకపోవటంతో మాకు జాగ్రత్తలు చెప్పి వెళ్ళిన నాన్న పదిరోజుల తర్వాత వచ్చాడు. అయితే ఒంటరిగా రాకుండా ఒక మహమ్మారిని వెంటబెట్టుకు వచ్చాడు.. అదేనండీ మా కుటుంబంలో చిచ్చు రేగటానికి కారణమైంది!

అక్కడి వాళ్ళు మా నాన్నకు మందు అలవాటు చేశారు. ఇంటికి వచ్చాక మానెయ్యవచ్చులే అనుకున్నాడు గానీ... సాయంకాలానికి కల్లుపాక వైపు వెళ్ళకుండా ఉండలేకపోయేవాడు.

ఆ అలవాటుతో వచ్చే అనర్థాలన్నీ మా ఇంట్లోనూ చోటు చేసుకున్నాయి. చేటు చేశాయి! కోపం అన్నదే తెలియనట్టుండే నాన్నకి చిరాకు పెరిగింది. ఆ అలవాటును మానెయ్యమని చెబితే చాలు... కోపమూ, చిరాకూ పెరిగిపోయేవి! అలా అమ్మా నాన్నల మధ్య పోట్లాటలూ పెరిగాయి...!

మా తెలుగు మాస్టారు... ఒకసారి పాఠం మధ్యలో ఒక కవిగారి గురించి చెబుతూ... సందర్భాన్ని బట్టి వారి కవిత్వంలోని ఒక వాక్యం చెప్పారు. 'చక్కని సంతోషాల చిలుకలు ఎగిరిపోయి... ఇంటిలో ఇక్కట్ల గబ్బిలాలు స్థిరపడ్డాయి...!' అని.

మా అమ్మనాన్నల గొడవ విన్నపుడల్లా... నాకెందుకో ఆ మాటే గుర్తుకు వచ్చేది...! అందుకు కారణమైన ఆ అలవాటును వదిలించుకోమని నేనూ సలహా ఇవ్వటం నాన్నకి నచ్చలేదు. గట్టిగా అరిచాడు. నాకు కోపం, రోషం వచ్చాయి. అప్పటినుండి నేను నాన్నతో మాట్లాడటం పూర్తిగా మానేసాను.

అమ్మ తినీ తినకా ఏమోగానీ, అనారోగ్యంతో మంచం పట్టింది. ఇంటిపనులు చూసుకుంటూ పొలం పనులకి వెళదామని బడి మానేసాను. 'చక్కగా చదువుకునే అమ్మాయిని స్కూలు ఎందుకు మానిపించారూ...?' అంటూ మా ఇంటికి వచ్చిన మాస్టారు నాన్నని అడిగారు. నాన్న జవాబు కోసం తడుముకుంటూండగానే నేను మాస్టారుకి చెప్పేసాను.

'మా నాన్న ఒక ఊబిలో దిగబడిపోయి... పనులకు వెళ్ళలేక పోతున్నాడండీ... వెళ్ళినా ఆయన సంపాదన ఆయన ఖర్చులకే. మా అమ్మని చూసుకోవటానికి నేనయినా పనులకి వెళ్ళాల్సిన పరిస్థితి వచ్చిందని ' వివరించాను.

మా నాన్నకు నా మాటలు చురుక్కుమనిపించాయి కాబోలు... ఆలోచనలో పడ్డాడు. ఆ తరువాత మా ఇంటికి వచ్చిన మాష్టారు దగ్గిరికి వెళ్ళి... నా మౌనాన్ని భరించలేకపోతున్నాననీ, మందు అలవాటునూ మానలేకపోతున్నాని మొరపెట్టుకుంటే... ఇక్కడ చేరితే బావుంటుందని ఆ మాష్టారే మంచి సలహా ఇచ్చారు. మా అదృష్టం కొద్దీ మా నాన్న ఇక్కడ చేరటానికి సమ్మతించాడు. తొందరగానే మనిషిగా మారాడు. మా పొలం పనులు చూసుకుంటూనే ఇక్కడ రోజూ రెండు పూటలా వచ్చి మొక్కల సంరక్షణ చేస్తూ తోటమాలిగానూ పని చేస్తున్నాడు.

నేను బడికి వెళ్ళటం మళ్ళీ మొదలు పెట్టాను. మా అమ్మ ఆరోగ్యమూ బాగుపడిరది! ఇలా... మీ అందరి ముందూ నిలబడి మా కుటుంబ అనుభవాలను పంచుకునే అవకాశం దొరికినందుకు చాలా ఆనందిస్తున్నాను...'' అంటూ ఆ అమ్మాయి చేతులు జోడిరచి ముగించింది.

చిన్నమ్మాయి అయినా అంత చక్కగా మాట్లాడటం అభిరామ్‌ని ముగ్ధుడిని చేసింది! ఆ అమ్మాయినే ఒప్పించి... అలా నటులుకాని మామూలు వ్యక్తులతోనే... తాను రచించిన నాటికను సహజంగా చిత్రీకరించగలిగాడు... అభిరామ్.